# తెరచాటు

సునీత అరగంట నుంచి అద్దంముందు నిలబడి బ్లౌజు సర్దుకుంటోంది. ముందుకు లాగినా, వెనక్కి తోసినా కిందకి సర్దినా, ఏం చేసినా పల్చగా, అందంగా సూటిగా బయటకి చూస్తూనే వుంది. మోకాళ్ళ వరకు వున్న పింక్ స్కర్టుమీద లేతగులాబీ రంగు విదేశీబట్టతో కుట్టినా అధునాతనమైన ఆ జాకెట్ ఎలా అమర్చుకోవాలో తెలీడంలేదు. లోపల బాడీ బిగించినా పొంగివస్తున్న యవ్వనం పోటీ పడుతూనే వుంది!

సునీత అవస్థపడుతోంది. ఆమె పెద్దమనిషై రెండేళ్ళు దాటుతోంది, సీనియర్ యింటర్ పరీక్షలు వ్రాసింది. ఆమె యింతవరకు మినీస్కర్టులే వేస్తోంది. అణచలేని అందాన్ని వెన్నెలారబోస్తూ వుంది.

వసుంధరకి కూతురు పరికిణి, ఓణీలు వేసుకోవడం యిష్టం వుండదు. తన కూతురు పెద్దగా, ఆరిందాలా కనిపిస్తే ఆమెకి బాధగా వుంటుంది. అందులో ఆమెకి తన వయసు కనిపిస్తుందేమో! ఆ తల్లి దృష్టిలో సునీత ఎప్పుడూ పధ్నాల్గేళ్ళ బాలిక - అంతే—

సునీతకి ఈ విషయంలో యిదీ అని ఒక అభిప్రాయం లేదు. కొన్ని విషయాల్లో అమ్మమాట వినకపోయినా, డ్రస్సు విషయంలో మాత్రం తు. చ. తప్పకుండా వింటుంది? తను గంతులేసినా, పరుగులు పెట్టినా ఎవరితో ఎలా షికార్లు కొట్టినా అమ్మ అడ్డుచెప్పదు. తనొక చిన్నపిల్ల అన్నట్లు వ్యవహరిస్తుంది. తనతోటిదే రాజ్యలక్ష్మి. అమ్మో! వాళ్ళమ్మ ప్రతీదాన్ని సాగలాగి దుంప తెంచుతుంది. ఎప్పుడూ పరికిణీ మీద ఓణీ వేసుకోవల్సిందే. ముచ్చటకైనా మరో మాట మాట్లాడితే వూరుకోదు. తనకా విషయంలో హాయి—, నెలకి మూడు రోజులు కాస్త జాగ్రత్తగా డ్రస్ చేసుకుంటే చాలు–, అయినా అప్పటికి కావలసిన సలహాలు, సరంజామా అమ్మ ఎప్పుడూ సిద్ధంగా వుంచుతుంది — ఇదీ సునీత ఆలోచన. అందుకే ఆమె తల్లి చెప్పినట్లే డ్రస్ చేసుకుంటుంది—

అయితే అనుకోకుండా సునీతలో చిత్రమైన మార్పు వచ్చింది—, అదీ, నాలుగురోజుల క్రితం—

*  *  *

ఆ రోజు సునీత, రాజ్యం కలిసి సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు, వసుంధర ఎప్పుడూ పెద్దగా అభ్యంతరం పెట్టదు. కారణం ఆమెకి రాజ్యలక్ష్మి అంటే యిష్టమే.

ఆ అమ్మాయి ఫస్టుక్లాసు స్టూడెంట్. అందుకే అప్పు డప్పుడు.

పల్లెటూరి వాలకమైనా బుర్ర పదునైనదే" అంటూ కామెంటు చేస్తూ వుంటుంది.

సునీత సినిమా టైముకి కారు పంపమని వాళ్ళ డాడీకి చెప్పింది, ఆయనలాగే పంపారు.

సునీత "అమ్మా నువ్వూ రావే" అంది.

నిజానికి సునీత తల్లి రావాలని అడగలేదు. తనూ, రాజ్యం కనిపించిన ప్రతీ కుర్రాడినీ ఏడిపించటానికి, ఉడికించ టానికి వీలుండదు తల్లివుంటే—, అయినా వూరికే అడిగింది.

వసుంధర కూడ చిన్న పిల్లలతో బయలుదేరదు. అందుకే రానంది.

సునీత హుషారుగా కారెక్కింది. అయిదు నిముషాల్లో కారు రాజ్యం ఇంటి ముందు ఆగింది. రాజ్యలక్ష్మి చక్కగా ముస్తాబయి వుంది. వొదులుగా జడ, మెరుస్తున్న ఎర్రరాళ్ళ దుద్దులు కళ్ళకు సన్నగా కాటుక, తీర్చిన బొట్టు. బట్టలు మాత్రం మార్చుకోలేదు, సునీతని చూసి ఎగిరిగంతేసింది.

"అబ్బ ! ఇంత ఆలస్యమా ! నీ కోసం చూసి, చూసి, యింక రావేమో అనుకుంటున్నా" అంది గారంగా.

"ఎంత సేపూ నా మీాదే నీ ఏడుపు. నువ్వెంత రెడీగా వున్నావో చూడు! ఆ బట్టలూ, నువ్వూనూ" అంటూ దబాయించింది సునీత.

"ఎంత ఒక్క క్షణం" అంటూ పరుగెట్టబోయి సునీత చెయ్యి పట్టుకుంది.

"ఓ మై గాడ్! అప్పుడే ఆరై పోతోంది" అంటూ రాజ్యలక్ష్మి ననుసరించింది సునీత.

మేడమీాద గదిలోకి లాక్కుపోయింది రాజ్యం. బీరువా తీసి అందులోంచి నాలుగు పట్టు పరికిణీలు తీసి ముందు మంచం మీాద పడేసి "సుని, ప్లీజ్, ఏది కట్టుకోనో చెప్పూ, క్విక్, ఒన్ మినిటులో చెప్పాలి" అంది జాకెటు గుండీలు టప టప లాగేస్తూ.

ఎర్రటి ఎరుపు మీాద ఆకు పచ్చ జరీ అంచు - తెల్లటి తెలుపు. ఎర్రటి జరీ - ముదురాకుపచ్చ మీాద జరీ బుటా - పసుపుపచ్చ నల్లటి జరీ—

ఎర్రటి పరికిణీ తీసి రాజ్యాని కిస్తూ 'యిదిగో త్వరగా' అంటూ తొందరచేసి, పక్కనే వున్న తెల్లటి పట్టు పరికిణి చేత్తో సున్నితంగా తాకుతూ "ఇది చాలా బాగుంది రాజీ" అంది. ఆ అనడంలో ఎంతో ఆడతనం, ఎంతో నాజూకుతనం వుంది. అటు తిరిగి జాకెటు మార్చుకుంటున్న రాజ్యం చటుక్కున భుజాలమీాదుగా వెనక్కి తిరిగి చూసింది. జాకెట్

చివరి హుక్ పెట్టేసి సునీత వైపు తిరిగి ఆమె భుజాల మీద చేతులు వేసి “డియర్ సునీ - ఈ వేళ నే చెప్పినట్లు వినాలి- అంటే సువ్వీ లంగా ఓణివేసుకో - ప్లీజ్, నీకెంతో బాగుం టుంది. ఇద్దరం కలిసి ఒకేలా వెళ్దాం, ఏం ? సునీ యీజ్ ఎ గుడ్ గరల్” అంటూ తొందరచేసింది.

సునీతకి మనసులో వేసుకోవాలని వుంది. ఎప్పటి నుంచో మనసులో వున్న కోరిక, ఆ అనుభవం తనకి కొత్త, వక్కసారి వేసుకుందామనే వుంది. అయితే అది రాజ్యంది అయినా రాజ్యం పరాయిది కాదు. తన ప్రాణ స్నేహితు రాలు, ఇద్దరి మధ్యా అసలు తేడా లేదు. దాని బట్టలు తను వేసుకుంటే తప్పేమి లేదనిపించింది. సునీత ఆలోచన తెగకుండానే -

“క్విక్ సునీ, టైము చూడు” అంటూ కంగారు పెట్టేసింది రాజ్యం.

సునీత బట్టలు మార్చుకుంది, మెత్తగా అందంగా ఓణి గుండెల్ని కప్పుతుంటే సునీతకు కొత్తగా, చిత్రంగా అని పించింది. తన గుండెలు పల్చటి పల్లెవాటులోంచి చూస్తే అందంగా హుందాగా వున్నట్లనిపించింది, వక్షస్థల మీద సుతారంగా కదిలిన ఓణి గిలిగింతలు పెట్టింది. ఆ గిలిగింతలు గుండెలో కూడ కలవర పెట్టాయి. చేత్తో రెండు మూడు సార్లు ఓణి సర్దుకుంది. మేలి ముసుగులోంచి ముగ్ధమోహన కాంత ధైర్యంగా కళ్ళెత్తి చూసినట్లు సునీతలోని యవ్వనం ధైర్యంగా పొంగింది. ఆమె బరువుగా వూపిరి తీసుకుంది.

ఎంతో ఎత్తుగా, పొడుగ్గా, దిద్దిన బొమ్మలా వుండే సునీత ఆ దుస్తుల్లో అప్సరసలా వుంది. రాజ్యం అదే అంటూ బుగ్గమీద చిటికె వేసింది.

ఇద్దరూ సినిమాహాలు చేరారు. సుధీర్, చంద్ర టిక్కెట్లు తీసుకుని రెడీగా వున్నారు "మిమ్మల్ని ఎవరు టిక్కెట్లు కొనమన్నారు ?" అంటూ దెబ్బలాడటం మొదలెట్టింది రాజ్యలక్ష్మి. సుధీర్ ఆమెకి ఎలాగో సర్దిచెప్పున్నాడు—

"నో — ఐ డోంట్ ఎగ్రీ" అంటోందామె. చంద్రం మాత్రం మాటలు మర్చిపోయినవాడిలా నిలబడిపోయాడు.

సుధీర్ చిట్టచివరికి "పోనీ డబ్బులిచ్చేయ్" అన్నాడు విసిగి. అంతా నవ్వుకున్నారు. అంతవరకు సునీతని రెప్ప వెయ్యకుండా చూస్తున్న చంద్ర వులిక్కిపడి వాళ్ళ నవ్వులతో శృతి కలిపాడు.

చంద్ర తననే పరీక్షగా చూడటం సునీత గ్రహించినా, అతనెందుకలా చూశాడో అర్థం కాలేదు.

కాని అతనలా తనలోకి చూస్తుంటే తనకెందుకో గర్వంగా అనిపించింది. రోజూ దాపరికం లేకుండా వుండే తను యీ రోజు ఈ తెరచాటుతో ఎంతో కొత్తగా అయిపోయింది. మనసూ తనువూ నిండుగా వున్నట్లనిపించింది !

సునీతకి ఆ రోజంతా కొత్తగా మరో ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లుగా - అనుభూతి పొందింది. తల్లి తనని ఎంతో అధునాతనంగా వుంచినా తనలో నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఆచారాన్ని తుడిచి వెయ్యలేక పోయింది — ఇలా కాకుండా మరోలా తనుండలేదనిపించింది.

అమ్మ శాంతా ఆంటీకి ఫోన్ చేసి తనకి కారుడ్రైవింగ్ నేర్పటానికి చంద్రని రమ్మంది. చంద్ర గంటలో వస్తాడు. మళ్ళీ యీ మినీస్కర్టుతో అతనిముందు కెళ్ళాలంటే ఎంతో సిగ్గుగావుంది —

అమ్మతో తనకి పరికిణీలు కొనమని గొడవచేసింది.

“చాల్లే ఆరిందాలా, ఇప్పుడేం కంగారు. వెధవ ముసలి డ్రస్సులూ నువ్వూ - నీ కెప్పుడేది కొనాలో నాకు తెలిసు. నువ్వేమీ చెప్పకు” అని కసిరి — ఒక్క క్షణం ఆగి

“ఏం ఎవరేనా అన్నారా?’ అంది.

ఆ మాటకి సునీతకి చర్రున కోపమొచ్చింది

“ఎవరూ చెప్పకపోతే నాకేఅనిపించకూడదా!” అంది విసురుగా—

వసుంధర తేలిగ్గా శ్వాసవదిలి “మరేం మునిగిపోలేదులే - నే చెప్పినట్లు విను” అని తోసిపారేసింది.

o o o

చంద్ర పదినిముషాల్లో వచ్చేస్తాడు. తను అతనిముందు కెలా వెళుతుంది—

అద్దం ముందు సునీత అలాగే కూర్చుంది. తెల్లని ముత్యాలదండ గుండెల మీాదకి జారి, రెండూ ఒకటిగా గుండెల మధ్యకి, మెలికపడి మెరుస్తున్నాయి, పల్చటి బ్లౌజు గాలికి రెపరెపలాడుతోంది.

"హల్లో ! రెడీయేనా" అంటూ చంద్ర రానే వచ్చేశాడు—

సునీత తత్తరపడింది. సిగ్గుతో మనసు కుంచించుకుపోయింది. అనుకోకుండా సునీత రెండు చేతులు 'యింటూ'లా భుజంమీాద చేర్చి గుండెలు కప్పుకుని అతనివైపు తిరిగింది.

( "జ్యోతి" మాసపత్రిక నుండి )